సాక్షి
విశాఖపట్నం
బుధవారం, 2, ఏప్రిల్, 2025



విశాఖలో యూఎస్‌తో కలిసి భారత త్రివిధ దళాల కదన విన్యాసాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. భారత నౌకాదళానికి చెందిన ప్రెసిడెంట్ ఫ్లీట్ పిప్ ఐఎన్ఎస్ జలాశ్వ యుద్ధ నౌక ఆన్‌బోర్డ్‌పై ఇరుదేశాల త్రివిధ దళాలు కవాతు నిర్వహించారు. యూఎస్ మెరైన్ డివిజన్‌కు చెందిన మహిళా ప్రతినిధులు..పురుషులతో పోటీగా కవాతులో సత్తా చాటారు. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

న్యూస్‌రీల్

లడ్డూల అలంకరణలో రాసపోలమాంబ



తగరపువలస: మజ్జివలస గ్రామదేవత రాసపోలమాంబ అమ్మవారిని 101వ అలంకరణలో భాగంగా మంగళవారం ఆకుపచ్చ, ఎరుపు, పసుపు రంగుల లడ్డూలు, గజమాలతో అలంకరించారు. రౌతులవారి కళ్లాలకు చెందిన రౌతు వెంకటరావు, అరుణ, రాజు నాయుడు, ఇంద్రజ సహకారంతో ఈ అలంకరణ పూర్తి చేశారు. మజ్జివలసకు చెందిన తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

19న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు ఆ రోజు ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎస్ హరేందిర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఓ ప్రకటన విడుదల చేశారు.

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్), ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కోర్సులు నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో గల స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. కోర్సుల్లో ప్రవేశం పొందేవారు ఇంటర్మీడియట్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9381667986, 7207953919 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

6న సింహగిరిపై సీతారాముల కల్యాణం

సింహాచలం: శ్రీ రామనవమి పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఈ నెల 6న వైభవంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 నుంచి ఆలయ ప్రాంగణంలో కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. భక్తులంతా ఈ ఉత్సవంలో పాల్గొని ప్రసాదం, పానకం స్వీకరించాల్సిందిగా కోరారు. సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన రాములవారి సన్నిధిలో కూడా ఆ రోజు ఉదయం 10.30 నుంచి కల్యాణోత్సవం జరగనుందన్నారు.

గంగవరం పోర్టులో రెండు లోకో ఇంజిన్లు



పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో యాజమాన్యం అదనంగా రెండు లోకో ఇంజిన్‌లను మంగళవారం ప్రవేశపెట్టింది. దీంతో నౌకాశ్రయ నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు ర్యాక్ హ్యాండ్లింగ్ సామర్థ్యం కూడా మెరుగుపడనుంది. గంగవరం పోర్టు స్థిరంగా మెరుగైన సేవలు అందించడంతో పాటు కార్గో నిర్వహణ పరంగా కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ సందర్భంగా పోర్టు మేనేజ్‌మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ పోర్టులో కొత్తగా రెండు లోకో ఇంజిన్లు ప్రారంభించడం ద్వారా దిగుమతిదారులకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

అమ్మో.. పింఛన్ల కత్తెర



5,988

10 నెలల్లో తొలగించిన పింఛన్లు

పింఛన్ల ఏరివేత కొనసాగుతోంది. ప్రతీ నెల పింఛన్ల సంఖ్య తగ్గుతోంది. సదరం సర్టిఫికెట్ల పరిశీలన, దివ్యాంగులను ఆస్పత్రులకు పిలిచి పరీక్షలు చేయడం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. అలాగే టీడీపీకి అనుకూలంగా లేరన్న అక్కసుతో స్థానిక నేతల ఒత్తిళ్లతో సామాజిక పింఛన్ల తొలగింపు వంటివి జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చేనాటికి జిల్లాలో 1,65,891 పింఛన్లు ఉండగా.. ప్రతీ నెల కోత పెడుతూ ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 1,59,903 పింఛన్లు మిగిలాయి. ఈ పది నెలల కాలంలో 5,988 పింఛన్లు తొలగించారు.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 1.68 లక్షల మందికి పింఛన్లు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య రూ.1.59 లక్షలకు తగ్గుదల
- మళ్లీ ధ్రువపత్రాలు తెచ్చుకోవాలని దివ్యాంగులకు వేధింపులు

మహారాణిపేట : పండుటాకులపై కూటమి ప్రభుత్వం పగబట్టింది. అనర్హుల పేరుతో ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల ఏరివేత చేపడుతోంది. పింఛన్ భారాన్ని తగ్గించుకోవడానికి భారీ ఎత్తున కోత పెడుతోంది. ఇందుకోసం ఆరు దశల(సిక్స్ స్టెప్ సర్వే) పరిశీలన ప్రక్రియను శరవేగంగా చేపడుతోంది. తద్వారా ఏళ్ల తరబడి పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని భావిస్తోంది. ఇప్పటికే ఇటీవల ఇందిరానగర్–2లో చేపట్టిన సర్వేలో అయిదు శాతం మంది అనర్హులుగా అధికారులు తేల్చారు. దీంతో అన్ని సామాజిక పింఛనుదారుల్లో ఆందోళన నెలకొంది.

ఖజానాపై భారం తగ్గించుకోవడానికే..

ఎన్నికలకు ముందు చంద్రబాబు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. దీంతో లబ్ధిదారులు కూటమికి అధికారాన్ని కట్టబెట్టారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఖజానాపై భారం తగ్గించుకోవడానికి లబ్ధిదారుల సంఖ్యను కుదించాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రతి నెలా పింఛనుదారుల్లో కొత విధిస్తూ వచ్చింది. తాజాగా తనిఖీల పేరుతో భారీ సంఖ్యలో పింఛన్‌దారులను తొలగించాలని గట్టి నిర్ణయంతో ఉంది. అయితే టీడీపీకి అనుకూలంగా లేరన్న అక్కసుతో స్థానిక నేతల ఒత్తిళ్లతో కొంత మంది పేరు తప్పిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాల ముందు వరకు పింఛన్లు అందించిన అధికారులు.. ఈ రెండు నెలల్లో కుంటిసాకులు చెప్పి కొంత మంది పేర్లను తొలగించడం గమనార్హం. కూటమి నాయకులకు అనుకూలంగా లేని పింఛనుదారులకు పింఛన్లు నిలుపుదల చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సదరం సర్వే

జిల్లాలో మొత్తం 21,306 దివ్యాంగ పింఛన్లు ఉన్నాయి. ఈ లబ్ధిదారుల సంఖ్యను కుదించడానికి వేగంగా కసరత్తు జరుగుతోంది. ముందుగా దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి నూరు శాతం పర్సంటేజ్‌తో రూ.15 వేలు పింఛన్ పొందుతున్న 319 మంది ధ్రువీకరణ పత్రాల(సదరం)ను పరిశీలన చేశారు. వైద్యులు, అధికారులు ఇళ్లకు వెళ్లి విచారణ పూర్తి చేశారు. మిగతా దివ్యాంగుల(మానసిక, కంటి, ఆర్థోపెడిక్) సర్వే మొదలు పెట్టారు. అధికారులు ఇళ్లకు వెళ్లి సదరం సర్టిఫికెట్లు తనిఖీ చేస్తున్నారు. వైద్యుల బృందం రోగులకు మళ్లీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొత్తం 4,408 మంది మానసిక దివ్యాంగులు ఉండగా వారందరిని సంబంధిత ఆస్పత్రుల్లో ఇతర జిల్లాలకు చెందిన వైద్యుల ద్వారా పరీక్షలు చేయిస్తున్నారు. అనంతరం సదరం సర్టిఫికెట్ విచారణ చేస్తున్నారు. కంటి, ఆర్థోపెడిక్ దివ్యాంగులకు కూడా ఆయా ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేస్తున్నారు. వైద్యుల ధ్రువీకరణతో ధ్రువీకరణ పత్రాలు(సదరం) రద్దవుతాయన్న ప్రచారం జరుగుతోంది.



కంచరపాలెంలో వృద్ధాప్య పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

కూటమి ప్రభుత్వంలో పింఛన్ల కోత ఇలా..

నెల	పింఛన్లు
జూలై	1,64,239
ఆగస్టు	1,62,490
సెప్టెంబర్	1,62,000
అక్టోబర్	1,61,969
నవంబర్	1,61,584
డిసెంబర్	1,61,584
జనవరి	1,61,271
ఫిబ్రవరి	1,60,757
మార్చి	1,60,102
ఏప్రిల్	1,59,903

కొత్త పింఛన్లు కలే..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు ఇచ్చేవారు. ప్రతీ ఏటా జనవరి, జూలై నెలలో అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లను అందించడం జరిగేది. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు.. వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి మంజూరు పత్రం అందజేసిన పరిస్థితులు ఉండేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 10 నెలల్లో కొత్త పింఛన్లు ఇవ్వలేదు సరికదా.. ఉన్న పింఛన్లనే తొలగిస్తున్న పరిస్థితులున్నాయి.



పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో ప్రత్యేక అధికారి భాస్కర్

95.50 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలో మంగళవారం రాత్రి 7 గంటల వరకు వివిధ సామాజిక పింఛన్లను 95.50 శాతం వరకు పంపిణీ చేశారు. మొత్తం 1,59,903 మందికి గాను 1,52,713 మందికి పింఛన్లు అందజేశారు. మిగిలిన వారికి బుధవారం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో భారీగా కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు

- ఇప్పటి వరకు 1,503 మంది నిలుపుదల
- కార్మిక సంఘాల ఆగ్రహం.. నిరవధిక సమ్మె హెచ్చరిక



ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు విషయంలో యాజమాన్యం వెనక్కి తగ్గడం లేదు. స్టీల్‌ప్లాంట్‌లో అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని చెబుతున్న యాజమాన్యం.. రోజు రోజుకూ వారిని తొలగిస్తోంది. సోమవారం రాత్రి విడుదల చేసిన జాబితా ప్రకారం ఇప్పటి వరకు మొత్తం 1,503 మందిని నిలుపుదల చేశారు. ఈ అంశంపై కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌లోని కొన్ని విభాగాల్లో టెండర్ పూర్తయిన కాంట్రాక్ట్ సంస్థకు మళ్లీ పునరుద్ధరణ జరగకపోవడంతో ఇప్పటికే సుమారు 440 మంది కార్మికులు బయట ఉండిపోయారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై రీజినల్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల డిప్యూటీ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో కార్మికుల తొలగింపునకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, తొలగించిన కార్మికుల కోసం ఒక పూల్ ఏర్పాటు చేయాలని, తిరిగి పని దొరికితే వారికే ఉపాధి కల్పించాలని యాజమాన్యానికి సూచించారు. అయితే ఉక్కు మంత్రిత్వశాఖ నుంచి యాజమాన్యంపై రోజురోజుకు పెరుగుతున్న ఒత్తిడి కారణంగా.. ప్రతి రోజూ వందల మంది కార్మికులు బయోమెట్రిక్ హాజరుకు దూరమవుతున్నారు. మొదట్లో మెడికల్ ఫిట్‌నెస్ లేనివారు, సక్రమంగా విధులకు హాజరు కాని వారు, 55 ఏళ్లు పైబడిన వారిని తొలగించాలని యాజమాన్యం కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చింది. వారు తొలగించడానికి నిరాకరించడంతో యాజమాన్యమే ఆ జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఎక్కువ మంది 54 ఏళ్లు పైబడిన వారు, విధులకు సక్రమంగా హాజరుకాని వారు, అన్‌ఫిట్ కార్మికులే ఉన్నారని సమాచారం. మళ్లీ ఇలాంటి జాబితాలు ఎన్ని ఉంటాయో అని అటు కార్మికులు, ఇటు కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ఒక వైపు ఆర్ఎల్‌సీతో 7న సమావేశం ఉండగా, యాజమాన్యం ఇలా తొలగింపు చర్యలు చేపట్టడంపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్ఎల్‌సీ సమావేశం తర్వాత తమకు న్యాయం జరగకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని కార్మిక నాయకులు హెచ్చరిస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ దక్కేనా?



చెత్తతో నిండిన కాలువ : కూటమి పాలనలో ప్రస్తుత పరిస్థితి ఇది

- గతంలో మెరిసిన విశాఖ.. ఇప్పుడు ప్రశ్నార్థకం
- పడకేసిన పారిశుధ్యం.. ఆర్ఆర్ఆర్ సెంటర్ల మూత
- కమిషనర్‌ను నియమించుకోలేని అసమర్థత
- 'కూటమి' హయాంలో గాడి తప్పిన జీవీఎంసీ పాలన



మూతపడిన రెస్టో కేఫ్

డాబాగార్డెన్స్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటిన విశాఖ.. ఈ సారి ఎలాంటి ర్యాంకు సాధిస్తుందనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. చంద్రబాబు హయాం(2018–19)లో 23వ స్థానానికి పరిమితమైన విశాఖ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో గణనీయమైన ప్రగతిని కనబరిచింది. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టాప్–4లో నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిచింది. అయితే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు కోసం చేపట్టిన కార్యక్రమాలు ఈసారి ఆ స్థాయిలో జరగలేదని ప్రజలు భావిస్తున్నారు. అంతేకాకుండా జీవీఎంసీకి ప్రస్తుతం కమిషనర్ కూడా లేకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చేలా ఉంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో విశాఖ ఏ స్థానాన్ని దక్కించుకుంటుందో వేచి చూడాల్సిందే.

పర్యవేక్షించే నాథుడేడి?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవీఎంసీ పాలన పూర్తిగా గాడి తప్పింది. రెండున్నర నెలలుగా జీవీఎంసీకి కమిషనర్ లేకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పారిశుధ్య పనులు అటకెక్కాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే జరుగుతున్న సమయంలోనే నగరంలో చెత్త పేరుకుపోతోంది. టైర్లు పాడైపోవడంతో చెత్త తరలించే టిప్పర్లు, పొక్లెయిన్లు మూలకు చేరాయి. జీవీఎంసీలోని అన్ని జోన్లలో 30కి పైగా పొక్లెయిన్లు నిరుపయోగంగా ఉన్నాయి. పారిశుధ్య కార్మికులకు కనీస పనిముట్లు కూడా అందుబాటులో లేవు. ఈ దుస్థితిపై జీవీఎంసీ శానిటేషన్ అధికారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఓ కార్యక్రమాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర డేగా ప్రకటించారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించినట్లు కలెక్టర్ చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదు. వీధుల్లో ఎక్కడికక్కడే చెత్త దర్శనమిస్తోంది.

గతమెంతో ఘనం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖపట్నం గణనీయమైన అభివృద్ధి సాధించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో నగరంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి. కొత్తగా రోడ్లు, రోడ్ల విస్తరణ పనులు చేపట్టారు, జంక్షన్లను ఆధునికీకరించారు. బస్ షెల్టర్లను కొత్తగా తీర్చిదిద్దారు. మురుగునీటి కాలువలు నిర్మించారు. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడానికి వైఎస్సార్ క్లినిక్‌లు ప్రారంభించారు. నగరంలో కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి యూసీసీటీఆర్ఎఫ్ ప్రాజెక్టుల ద్వారా స్వీపింగ్ మిషన్లను ఉపయోగించారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఎకో వైజాగ్ పేరుతో ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అయితే ప్రస్తుతం కమిషనర్ లేకపోవడంతో ఈ పనులన్నీ ఆగిపోయాయి. జీవీఎంసీ పాలన పూర్తిగా గాడి తప్పిందని వామపక్ష నేతలు గత నెల 10న జీవీఎంసీ ఎదుట నిరసన తెలిపారు. కనీస సౌకర్యాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.



సిరిపురం దత్ ఐలాండ్ (ఫైల్)

అవిశ్వాసంపై పెట్టిన శ్రద్ధ.. పాలనపై లేదెందుకు?

వ్యర్థాల నిర్వహణకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్లు ప్రస్తుతం మూలన పడ్డాయి. జగదాంబ జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన వుమెన్స్ రెస్టో కేఫ్ నిరుపయోగంగా మారింది. నిధులు లేకపోవడంతో అభివృద్ధి, పారిశుధ్య పనులు ఆగిపోయాయి. ప్రధాన రహదారుల్లో కొంతమేర పారిశుధ్యం మెరుగ్గా ఉన్నా, గల్లీలు, వీధుల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. దోమల నివారణకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజలను భాగస్వాములను చేయాల్సిన స్వచ్ఛత కార్యక్రమాల్లో సచివాలయం సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చి.. ప్రభుత్వం అభాసు పాలైంది. ఆ మధ్య ఓటీపీలు సేకరించలేదని సచివాలయ కార్యదర్శులకు జోనల్ కమిషనర్ నోటీసులు జారీ చేయడంపై విమర్శలు వచ్చాయి. మేయర్‌పై అవిశ్వాసంపై పెట్టిన శ్రద్ధను కూటమి నేతలు కమిషనర్‌ను నియమించడంపై ఎందుకు చూపడం లేదనే ప్రశ్న ఇప్పుడు అందరి మదిలోనూ మెదులుతోంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌ను నియమించలేని అసమర్థత కూటమి ప్రభుత్వానిదేనని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విశాఖ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏ ర్యాంక్ సాధిస్తుందో చూడాలి.

దటీజ్ వైఎస్ జగన్

చంద్రబాబు ప్రభుత్వ హయాం (2018–2019)లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరం 23వ ర్యాంక్‌కే పరిమితమైంది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి తర్వాత 2020లో 9వ ర్యాంకు, 2022లో 4వ ర్యాంకు సాధించిన నగరం 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరోసారి 4వ ర్యాంకు సాధించి సగర్వంగా నిలిచింది. విజయవాడ, తిరుపతి కూడా జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించాయంటే ఆ ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుంది.

కూటమికి తొత్తులుగా పోలీసులు

- అర్ధరాత్రి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కుటుంబ సభ్యులకు బెదిరింపు
- పోలీసుల తీరుపై కలెక్టర్, సీపీకి వైఎస్సార్ సీపీ నేతల ఫిర్యాదు



సీపీ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, సిహెచ్.వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కేకే రాజు, దేవన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం : చట్టానికి లోబడి విధులు నిర్వర్తించాల్సిన కొంతమంది పోలీసులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల ఇంటికి పోలీసులు అర్ధరాత్రి వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారని.. దీన్ని సహించేది లేదన్నారు. జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాసానికి నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో కూటమి నేతలు అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. వారి ప్రలోభాలకు లొంగని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల కుటుంబ సభ్యులను బెదిరించి తమ వైపు తిప్పుకునే కుటిలయత్నాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం మల్కాపురం ప్రాంతంలోని ఓ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఇంటికి అర్ధరాత్రి పోలీసులు వెళ్లి వారి కుటుంబ సభ్యులను బెదిరించారని పేర్కొన్నారు. అందరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తామంటూ హంగామా సృష్టించారన్నారు. ఈ విషయమై మల్కాపురం పోలీస్‌స్టేషన్ సీఐకి ఫోన్ చేస్తే వెంటనే కట్ చేశారని తెలిపారు. మాజీ మంత్రి, ఓ పార్టీ జిల్లా అధ్యక్షుడినైన తన ఫోనే కట్ చేస్తే సామాన్యుల ఫోన్ వీరు లిఫ్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కె.కె.రాజు, దేవన్‌రెడ్డి, ముఖ్యనేతలు రవిరెడ్డి, చిక్కాల రామారావు, పేడాడ రమణకుమారితో కలిసి వెళ్లి కలెక్టర్ ఎం.ఎన్ హరేందర్ ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిలకు ఫిర్యాదు చేశారు. బెదిరింపులకు పాల్పడిన మల్కాపురం పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కార్పొరేటర్ల కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన పోలీస్ కమిషనర్ సంఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు బోని శివరామకృష్ణ, దొడ్డి కిరణ్, జీలకర్ర నాగేంద్ర, మార్కండేయులు పాల్గొన్నారు.

వృత్తి పన్ను చెల్లింపులకు ప్రత్యేక వెబ్‌సైట్

ఆరిలోవ: వృత్తి పన్ను చెల్లింపుదార్ల కోసం వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ముడసర్లోవ దరి దీన్‌దయాల్ పురం వద్దనున్న వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఆ శాఖ జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్ వెబ్‌సైట్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు నగరంలో పన్ను పరిధిలో ఉన్నవారు తమ వృత్తి పన్నును జీవీఎంసీకి చెల్లించేవారని తెలిపారు. ఇప్పటి నుంచి వాణిజ్య పన్నుల శాఖకు చెల్లించాలని సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. దీని కోసం ప్రత్యేకంగా http://www.apct.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలన్నారు. ఉద్యోగులకు నెలకు రూ.15 వేలు కంటే ఎక్కువగా వేతనం ఇస్తున్న యజమానులంతా ఈ వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు వార్షిక ఆదాయం రూ.10 లక్షల కంటే ఎక్కువ టర్నోవర్ కలిగి ఉండి జీఎస్టీ చెల్లించేవారు కూడా ఈ పన్ను చెల్లించాలని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సెక్యూరిటీ విధుల్లో ఏపీ ఎస్‌పీఎఫ్



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌పీఎఫ్ సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్యూరిటీ విధుల్లోకి సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పాటు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్)ను నియమించబోతున్నారు. స్టీల్‌ప్లాంట్ పొదుపు చర్యల్లో భాగంగా సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ నుంచి సుమారు 438 మందిని తగ్గించి ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వారి స్థానంలో మొదట హోంగార్డులను నియమించాలనుకున్నారు. స్టీల్‌ప్లాంట్ వంటి సున్నితమైన పరిశ్రమలో హోంగార్డులు సరికాదని నిర్ణయించి, ఆ స్థానంలో ఎస్‌పీఎఫ్ సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఎట్టకేలకు ఆదివారం కేంద్ర ఉక్కు సహాయమంత్రి శ్రీనివాసవర్మ, ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్‌లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించినట్టు తెలిసింది. ఇందులో భాగంగా విజయవాడలోని ఏపీ ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం ఒక సర్క్యులర్ విడుదల చేసింది. స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించడానికి ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10లోగా తమ అంగీకారం తెలపాలని అందులో పేర్కొన్నారు. మొదటి దశలో 100 మందిని, ఆ తర్వాత దశల వారీగా సిబ్బందిని నియమించేందుకు అంగీకరించినట్లు ఉక్కు అధికార వర్గాల సమాచారం.

మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

అల్లిపురం: ఇన్‌స్టెంట్ లోన్ యాప్‌ల కోసం మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సరఫరా చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏడాది కిందట మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల కారణంగా ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు, మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా క్యాస్‌మాక్స్ యాప్ ద్వారా లోన్ కార్యకలాపాలు బిహార్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ రాష్ట్రాల నుంచి సాగుతున్నట్లు గుర్తించారు. వాట్సాప్ ద్వారా వచ్చిన బెదిరింపు కాల్స్, మెసేజ్‌లు పాకిస్తాన్ నుంచి ఆపరేట్ అయినట్లు తేలింది. మృతుడి బ్యాంక్ స్టేట్‌మెంట్‌ల ద్వారా, అతను తీసుకున్న లోన్ మొత్తం అసోం, గుజరాత్‌లోని బ్యాంకు ఖాతాల నుంచి వచ్చినట్లు గుర్తించారు. అతని భార్య చెల్లించిన డబ్బులు కూడా అసోంలోని ఖాతాల్లోకి చేరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఖాతాల నుంచి దాదాపు 9 వేల మందికి డబ్బు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. వీటిని విశ్లేషించగా 61 ఖాతాల నుంచి లోన్ యాప్ ఖాతాల్లో డబ్బు డిపాజిట్ అవుతున్నట్లు నిర్ధారించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైం పోలీసులు బిహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, అసోం, గుజరాత్ రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలుగా వెళ్లారు. దర్యాప్తులో భాగంగా కరెంట్, సేవింగ్స్ ఖాతాలు తెరిచి లావాదేవీలు జరుపుతున్న కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతను ఈ ఖాతాల ద్వారా రూ.12 లక్షల వరకు సంపాదించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు బిహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్టెంట్ లోన్ యాప్‌లు మళ్లీ విజృంభిస్తున్నందున.. ప్రజలు ఎవరూ ఆన్‌లైన్ లోన్‌లు తీసుకోవద్దని నగర పోలీసులు హెచ్చరించారు.

మొదటి రోజు హాజరు అంతంతే..

- మద్దిపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గత సంవత్సరం 520 మంది విద్యార్థులు ఫస్టియర్ చదివారు. కాలేజీ తెరిచిన తొలిరోజు మంగళవారం 20 మంది విద్యార్థులు హాజరైనట్లు నమోదు చేశారు. కానీ 'సాక్షి'పరిశీలన సమయంలో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఆరుగురు సీఈసీ, ఒకరు హెచ్ఈసీ గ్రూప్ అభ్యసిస్తున్నవారు ఉండగా.. వీరిని ఒకే రూమ్‌లో కూర్చోబెట్టి, భోజనాలు పెట్టి పంపించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం 100 మందికి పంపించగా.. అదంతా వృథా అయింది.
- ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో 350 మందికి గానూ తొలి రోజు 102 మంది వరకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ సత్యవినోద్ తెలిపారు. కానీ తరగతి గదుల్లో విద్యార్థులు మాత్రం ఆ స్థాయిలో కనిపించలేదు. ఇక్కడి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టిన తర్వాత కోడిగుడ్లను స్టావ్‌పై పెట్టి ఉడకబెడుతున్న దృశ్యాలు కనిపించాయి.
- మండుటెండల్లో ఇంటర్ తరగతులేంటి? వడగాల్పులు తట్టుకోలేక విద్యార్థులకేమైనా జరిగితే, ఎవరిని బాధ్యులను చేస్తారు? అడ్మిషన్ల పేరిట ఇదేమి విద్యా క్యాలెండర్? విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకుల అభిప్రాయాలతో ఏ మాత్రం పనిలేకుండా ఇవేమి నిర్ణయాలు? ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడమే ప్రస్తుత పాలకుల లక్ష్యమన్నట్లుగా ఉంది. తొలి రోజు కాలేజీలో విధులకు హాజరైన ఓ అధ్యాపకుడి అభిప్రాయమిది.

- వేసవిలో తరగతులపై విద్యార్థుల అనాసక్తి
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు
- విద్యా క్యాలెండర్‌పై అందరిలోనూ అసంతృప్తి
- ముహూర్తం బాగాలేదని తెరవని ప్రైవేట్ కాలేజీలు

విశాఖ విద్య: జిల్లాలోని జూనియర్ కాలేజీలు మంగళవారం తెరుచుకున్నాయి. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. కానీ జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల హాజరు అంతంతమాత్రంగానే నమోదైంది. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలైతే మంగళవారం రోజు ముహూర్తం బాగాలేదని తెరవలేదు. విద్యారంగంలో సంస్కరణల పేరిట కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఏ ఒక్కరికీ రుచించడం లేదనేది తేటతెల్లమవుతోంది. ఏటా వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులు వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తుంటారు. కానీ తాజా పరిణామాలతో ఇటీవలే పరీక్షలు రాసి.. వేసవి సెలవుల మూడ్‌లోకి వెళ్లిన విద్యార్థులను కాలేజీలకు రండి అని కబురు పంపినా, వారి నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు.



వీఎస్ కృష్ణా ప్రభుత్వ కాలేజీలో తరగతులకు హాజరైన ఏడుగురు విద్యార్థులు

ప్రభుత్వ కాలేజీల్లో 15 శాతం హాజరు

జైలురోడ్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో స్పాట్ వాల్యూయేషన్ జరుగుతున్నందున తరగతులు నిర్వహించలేదు. జిల్లాలోని మిగతా కాలేజీల్లో తొలిరోజు 288 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ లెక్కన 15 శాతం మాత్రమే హాజరు నమోదైంది. కాలేజీలకు వచ్చిన వారిలోనూ చాలా మంది విద్యార్థులు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. జిల్లాలోని ఆనందపురం, ఇస్లాంపేట కాలేజీలకు అయితే ఇద్దరంటే ఇద్దరే విద్యార్థులు హాజరుకావడం గమనార్హం.

ముందస్తు కసరత్తు ఏదీ?

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 211 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో 188 కాలేజీల్లో అడ్మిషన్లు జరిగాయి. సుమారు 40 వేల మంది విద్యార్థులు ఈ ఏడాది రెండో సంవత్సరంలోకి అడుగిడుతున్నారు. అయితే 2025–26 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌ను ప్రభుత్వం ప్రకటించినా.. దీని అమలుకు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై ఏ మాత్రం దృష్టి పెట్టలేదు. జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో చదువుకునే విద్యార్థుల్లో చాలా మంది వసతి గృహాల్లో ఉంటున్నారు. కానీ ప్రస్తుతం వసతి గృహాలు తెరవలేదు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి కాలేజీకి రావాలంటే.. బస్సు పాసులు ఇంకా జారీ చేయని పరిస్థితి ఉంది. మరో పక్క మండుటెండలు కాస్తున్నాయి. ఇలాంటి సమస్యలపై ఏ మాత్రం అవగాహన లేకుండా ప్రభుత్వం గొప్పలు పోతుండటంతో విద్యా రంగం తిరోగమనంలోకి వెళ్లడం ఖాయమని విద్యావేత్తలు అంటున్నారు.

చదువులకు ప్రభుత్వ సాయం లేదు



అమ్మ రెక్కల కష్టంతోనే తమ్ముడు, నేను చదువుకుంటున్నాం. గతంలో తమ్ముడికి అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. ఆ డబ్బులు మాకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ ప్రభుత్వంలో ఇంట్లో ఎందరున్నా తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. ఏడాదంతా ఎదురుచూసినా రాలేదు.

– ఎస్. తేజస్వి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

ఎండల్లో కాలేజీకి రావడం కష్టమే..



పరీక్షలు అయిపోతే సెలవుల్లో ఎంచక్కా ఊర్లెళ్లేవాళ్లం. ఇలా పరీక్షలు అయ్యాయో లేవో మళ్లీ కాలేజీకి రావాలని పిలుపు వచ్చింది. ఎండల్లో కాలేజీకి రావడం కష్టమే. మా ఫ్రెండ్స్ కూడా ఇదే మాట అంటున్నారు. కొన్ని రోజులు వచ్చి.. ఎండలు పెరిగితే ఇంటి వద్దనే ఉండిపోతాను.

– ఎస్.సిరివెన్నెల, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

మా కష్టాలు పట్టించుకోరా?



కాలేజీలో 2001 నుంచి ఆయాగా పనిచేస్తున్నాను. ఎప్పుడు కూడా వేసవి సెలవుల్లో కాలేజీ లేదు. వేసవి సెలవుల్లో ఇళ్ల వద్ద ప్రశాంతంగా ఉందామని అనుకున్నాం. కానీ, ఇప్పుడేమో ఆ పరిస్థితి లేదు. పొద్దున వచ్చి, సాయంత్రం వరకు కాలేజీలోనే పనిచేస్తాం. మా కష్టాన్ని కూడా పట్టించుకోవాలి.

– ఈశ్వరమ్మ, ఆయా, కృష్ణా కాలేజీ

మద్యం మత్తులో స్కూల్ ఆటో డ్రైవర్ బీభత్సం

- డివైడర్‌ను ఢీకొనడంతో ఆటో బోల్తా
- ఆరుగురు విద్యార్థులకు గాయాలు

అక్కిరెడ్డిపాలెం: మద్యం మత్తులో స్కూల్ ఆటోడ్రైవర్ డివైడర్‌ను ఢీకొట్టడంతో.. ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. గాజువాక చైతన్యనగర్‌లోని చైతన్య స్కూల్, చినగంట్యాడలోని ఏవీకే స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులను మిందికి చెందిన డ్రైవర్ ఎర్రునాయుడు మంగళవారం మధ్యాహ్నం 1.20 సమయంలో ఆటోలో ఎక్కించుకున్నాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించి ఉన్న ఆయన మింది నుంచి పాతగాజువాక వైపు వెళ్తున్నాడు. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద నుంచి సర్వీసు రోడ్డులో కాకుండా.. మద్యం మత్తులో అతివేగంగా జాతీయ రహదారి ఎక్కేశాడు. పాత గాజువాక సమీపిస్తుండగా బజాజ్ షోరూం వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న ఫార్మా కంపెనీ బస్సును ఓవర్ టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న సీహెచ్ భార్గవ్(2వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్), సీహెచ్.నిమిష(8వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్), సీహెచ్.భువనదీప్(5వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్), కె.సాహితీ(8వ తరగతి, ఏవీకే స్కూల్), అభిరామ్(7వ తరగతి, ఏవీకే స్కూల్), మౌనిక(4వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్)లకు గాయాలయ్యాయి.



ఎడుమ చెవి వద్ద గాయం అయిన విద్యార్థిని పరిశీలిస్తున్న ఏసీపీ



విద్యార్థిని చేతిపై గాయం

వెంటనే స్థానికులు స్పందించి.. విద్యార్థులను అక్కడే ఉన్న చిన్నపిల్లల ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు ఆస్పత్రికి వెళ్లి.. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గాయాలపాలైన వారిని పరిశీలించారు. ఆటో డ్రైవర్ ఎర్రునాయుడును బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేయగా 550గా నమోదైందని సీఐ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుగా నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆటోను స్టేషన్‌కు తరలించారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఏడాదంతా ఎంతో శ్రద్ధతో చదువుకుని పరీక్షలను ఎదుర్కొన్న విద్యార్థులకు రిలీఫ్ దొరికింది. ఆఖరి రోజున కేంద్రాల వద్ద విద్యార్థులు సందడిగా కనిపించారు. పాఠశాల స్థాయిలో ఇవే చివరి పరీక్షలు కావడం, ఇంటర్మీడియట్ ఆ పై కోర్సుల్లో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో తోటి విద్యార్థులతో సరదాగా గడిపారు. తల్లిదండ్రులు తీసుకొచ్చిన సెల్‌ఫోన్లతో పరీక్ష ముగిసిన తర్వాత కేంద్రాల బయట సెల్ఫీలు దిగారు. మళ్లీ కలుద్దాం అంటూ బైబై చెప్పుకున్నారు. కాగా.. గత నెల 17న 10వ తరగతి పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. మంగళవారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 28,566 మంది నమోదు చేసుకోగా.. 94 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ జిల్లాలోని 7 పరీక్ష కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 35 కేంద్రాలను పరిశీలించారు. ఈ ఏడాది రెగ్యులర్ పరీక్షలతో పాటే, సార్వత్రిక విద్యావిధానం(ఓపెన్)లో టెన్త్ పరీక్షలు జరిగాయి. ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతుందనే ప్రచారం ఉండేది. గతేడాది భీమునిపట్నం, ఆనందపురం వంటి సెంటర్లలో ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాయగా డిబార్ కూడా అయ్యారు. ఇలాంటి కేంద్రాలపై డీఈవో నేతృత్వంలో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేయడంతో.. ఈ సారి మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

చేపల వేటకు వెళ్లి.. చెరువులో శవంగా మారి..

- అనుమానాస్పదంగా వ్యక్తి మృతి
- హత్యేనంటున్న మృతుడి తల్లిదండ్రులు



ఎరుసు సంతోష్ (ఫైల్)



మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న బంధువులు

కొమ్మాది: చెరువుకు వెళ్లి చేపలు పట్టుకుని వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి శవమై కనిపించిన సంఘటన భీమిలి బీచ్‌రోడ్డులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి రెడ్డిల పాలేనికి చెందిన ఎరుసు సంతోష్ (35) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఖాళీ సమయంలో సమీపంలో చెరువుకు వెళ్లి చేపలు పట్టడం ఆయనకు అలవాటు. ఆయనకు నర్సిబాయ్ అనే మహిళతో వివాహం అయింది. పూజిత అనే కుమార్తె ఉంది. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె కుమార్తెతో వేరొక చోట ఉంటోంది. కాగా.. ఉగాది రోజు తల్లిదండ్రులతో కలిసి సంతోషంగా గడిపాడు. అదే రోజు సాయంత్రం చెరువుకు వెళ్లి చేపలు పట్టుకుని వస్తానని చెప్పి బయలుదేరాడు. అయితే ఆ రోజు ఇంటికి రాలేదు. స్నేహితులతో కలిసి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని తల్లిదండ్రులు భావించారు. సోమవారం కూడా ఇంటికి రాకపోవడంతో అతని తండ్రి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. కాపులుప్పాడలోని చెరువులను పరిశీలించగా... ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం చేపలుప్పాడ కంబాల చెరువు ఒడ్డున సంతోష్ శవమై కనిపించాడు. వెంటనే అప్పలరాజు తమ బంధువులు, పోలీసులకు సమాచారం అందించారు.

మృతిపై అనుమానాలెన్నో..

సంతోష్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి మృతి చెందడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. అతను నీటిలో మునిగి చనిపోయాడని అనుకుంటే చెరువులో పూర్తి స్థాయిలో నీరు లేదు. పోనీ ఊబిలో చిక్కుకున్నాడని అనుకుంటే ఆయన మృతదేహం ఒడ్డున పడి ఉంది. సంతోష్ చేతులు, ముఖంపై తీవ్ర గాయాలున్నాయి. కాగా.. తన కుమారుడిని ఎవరో హత్య చేసి ఉంటారని సంతోష్ తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భీమిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమిలి మార్చురీకి తరలించారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

పెదగంట్యాడ: సంజీవికాలనీకి చెందిన ఓ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని సంజీవికాలనీలో పైల అప్పారావు, సూర్యావతి దంపతులు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. అప్పారావు కలాసీగా పని చేస్తుండగా సూర్యావతి బ్రాండిక్స్‌లో పని చేస్తోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె దివ్య(21) ఉన్నారు. దివ్య నరవలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో, కుమారుడు గుడ్లవల్లేరులో చదువుతున్నాడు. రంజాన్ సందర్భంగా సోమవారం కళాశాలకు సెలవు కావడంతో దివ్య ఇంట్లోనే ఉంది. తల్లి బీ షిఫ్ట్‌కు బ్రాండిక్స్‌కు వెళ్లిపోయింది. కాగా.. రాత్రి 9.30 గంటల సమయంలో ఓ వ్యక్తి అప్పారావుకు ఫోన్ చేశాడు. దివ్య ఫోన్ ఎత్తడం లేదని తెలిపాడు. దీంతో అప్పారావు వెంటనే ఇంటికి చేరుకున్నాడు. తలుపులు వేసి ఉండడంతో ఎంత కొట్టినా తెరవలేదు. దీంతో తన తోడల్లుడు సాయంతో కిటికీని విరగ్గొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా.. బెడ్ రూమ్‌లో దివ్య ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించింది. వెంటనే న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనశిక్షణా సంస్థాన్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మద్దిలపాలెం : జన శిక్షణ సంస్థాన్‌లో స్వల్పకాలిక సమ్మర్ క్రాష్ కోర్సుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సిహెచ్.అప్పలనాయుడు తెలిపారు. బ్యూటీషియన్ 3 నెలలు, డెస్ మేకింగ్ 3 నెలలు, అడ్వాన్స్‌డ్ టైలరింగ్ కోర్సు 3 నెలలు, డీటీపీ 3 నెలలు, ఫొటోషాప్ 3 నెలలు, ప్రీ-స్కూల్ టీచర్ ట్రైనింగ్ 6 నెలలు, స్పోకెన్ ఇంగ్లిష్ 3 నెలలు, ఎంఎస్ ఆఫీస్ ఒక నెల, అకౌంటింగ్ ప్యాకేజీ ఒక నెల, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ 15 రోజులు, అగరబత్తి తయారీ ఒక వారం, జ్యూట్ బ్యాగ్ తయారీపై శిక్షణ ఉంటుందన్నారు.

అపూర్వ సమ్మేళనం



హెచ్ఎంలు ఇన్నయ్య, జోజిబాబు చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

- 1970 –1995 వరకు చదువుకున్న 27 బ్యాచ్‌ల విద్యార్థుల సమావేశం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేష్



సభలో ఆశీనులైన పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: అక్కడ పాత మిత్రులు జ్ఞాపకాలు కలబోసుకున్నారు. సుమారు 30 ఏళ్ల నాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. అప్పటి గురువులను స్మరించుకున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి ఆర్సీఎం స్కూల్ 1970 నుంచి 1995 వరకు పదో తరగతి వరకు చదువుకున్న 27 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు స్కూల్ ప్రాంగణంలో మంగళవారం సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆద్యంతం అలరించింది. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించిన ఈ కార్యక్రమంలో దశాబ్దాల క్రితం నాటి స్నేహ బృందాలు కలుసుకున్నాయి. ఆనందోత్సాహాలతో సందడి చేసింది. ఈ పాఠశాలలో చదివి ఇంజినీర్లు, టీచర్లు, లాయర్లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, రాజకీయ ప్రముఖులు వంటి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారంతా తమ పాత స్మృతులను నెమరవేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. తాము జీవితంలో ఎలా ఎదిగిందీ..ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పాఠశాల పరిస్థితులు, వాటి అభివృద్ధి గురించి ఆరా తీశారు. విద్యార్థుల ఉన్నతికి ఎనలేని కృషి చేసిన అప్పటి హెచ్ఎంలు ఇన్నయ్య, జోజిబాబు ఫాదర్స్ చిత్రపటాల వద్ద పూర్వ విద్యార్థులు నివాళులర్పించారు. ఇద్దరు గురువులను స్మరించుకున్నారు. ఇద్దరు హెచ్ఎంలు, అప్పటి గురువులు అందించిన ప్రోత్సాహంతోనే ఈ రోజు ఈ స్థితిలో ఉన్నామని వారి భావాలను వ్యక్త పరిచారు. పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అపూర్వ సమ్మేళనంలో పాల్గొని, తోటి పూర్వ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుని ఎమ్మెల్యేగా సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే గణేష్‌తో పూర్వ విద్యార్థులు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం పలువురు ప్రముఖులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యాచరణను సభలో చదివి వినిపించారు. ఆర్థికంగా వెనకబడిన పూర్వ విద్యార్థులకు సహాయపడాలని కూడా పూర్వ విద్యార్థులు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. పలువురు గురువులను సన్మానించారు. 27 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు చదువులమ్మ ఒడిలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.